www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -48 మంగళవారం 2 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01


Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disirtcts

# గుడిసెలు లేని గూడేలే లక్ష్యం



**కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కొరారి గ్రామంలో పైలాన్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

- ఆదివాసీలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ఏడాదిలో లక్ష ఇండ్లకు గృహప్రవేశాలు చేసుకున్నాం
- గుడిసెలు లేని గూడేలే లక్ష్యం
- ఐటీడీఏ ప్రాంతాల్లో (అదనంగా 21 వేల ఇండ్లు
- సెప్టెంబర్ 17న మరో (లక్ష ఇండ్ల గృహప్రవేశం
- రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం





**కాగజ్‌నగర్/ఆసిఫాబాద్‌జూన్ 1(ప్రజావినికిడి):** ”ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో ముందుకు నడిపించాలన్నదే మా ప్రయత్నం. ఇక్కడ గిరిజన, ఆదివాసీ బిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేయాలనేదే మా ఆలోచన. పేదలకు పక్కా ఇండ్లు ఇవ్వాలని అడవి బిడ్డలు వచ్చి నన్ను కోరారు. వెంటనే నియోజకవర్గానికి **మిగతా 2లో..**

# జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు.

- దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ద్వైవార్షిక ఎన్నికలు
- బీహార్, కర్ణాటకలో శాసనమండలి స్థానాలకు కూడా ఎన్నికలు
- జూన్ 18న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ జూన్ 1(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 27 రాజ్యసభ స్థానాలు, మూడు రాష్ట్రాల్లోని శాసనమండలి స్థానాల భర్తీకి ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈ మేరకు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్లు దాఖలు చేయడానికి జూన్ 8 చివరి తేదీ. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడాని **మిగతా 2లో...**






## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ నీట్-కు సుప్రీం నో !

- నీట్ రీ-టెస్ట్‌ను కంప్యూటర్ విధానంలో నిర్వహించాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- జూన్ 21న ఓఎంఆర్ పద్ధతిలోనే పరీక్ష యథాతథంగా జరుగుతుందని స్పష్టం
- ఈ దశలో మార్పులు చేయడం నిర్వహణాపరంగా కష్టమని కోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ జూన్ 1(ప్రజావినికిడి):** ప్రస్తుతమున్న పెన్ను పేపర్ తరహాలో బదులుగా కంప్యూటర్ బేస్డ్ తరహాలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను ఆదేశించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ దశలో పరీక్ష నిర్వహణా తీరును మార్చడం వల్ల ఆచరణాత్మక ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. పేపర్ లీకయిందనే ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యుజి 2026 పరీక్షను మే 12న దేశవ్యాప్తంగా రద్దు చేశారు. సిబిఐ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టింది. **మిగతా 2లో...**

## నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ప్రతి ఒక్కరిపైనా నిఘా
- అదనపు బలగాల మోహరింపు
- పోలీసులకు సహకరించాలన్న సీపీ బి.సుమతి

**జూన్ 1(ప్రజావినికిడి):** తెలంగాణ 13వ రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మూడు కమిషనరేట్ల పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. సికింద్రాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్స్‌లో **మిగతా 2లో..**



## ఉద్యోగుల బదిలీలపై నిషేధం

ప్రత్యేక సందర్భాల్లో మినహాయింపు


-ఉత్తర్వులు విడుదల

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

: టాపర్‌గా శుభమ్ కుమార్,

అమ్మాయిల్లో అరోహి దేశ్‌పాండే ఫస్ట్

- జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలను విడుదల చేసిన ఐఐటీ రూర్కీ
- మొత్తం 1.8 లక్షల మంది పరీక్ష రాయగా 56,000 మందికి పైగా అర్హత
- అర్హత సాధించిన వారికి జోసా కౌన్సెలింగ్ ద్వారా ఐఐటీలలో ప్రవేశాలు



**న్యూఢిల్లీ జూన్ 1(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ ఆశావహులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ ఈ ఫలితాలను ప్రకటించింది. **మిగతా 2లో...**

## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ...

- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు జనసేన సభకు అనుమతి నిరాకరణ
- పార్కింగ్ సమస్యను కూడా ఓ కారణంగా చూపి కార్యక్రమానికి బ్రేకులు
- ప్రభుత్వ నిర్ణయం అర్థరహితమంటూ జనసేన పార్టీ తీవ్ర ఆగ్రహం
- నిత్యం కార్యక్రమాలు జరిగే చోట తమకే ఎందుకు అడ్డంకులని ప్రశ్న
- కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అనుమతి ఇవ్వలేదని పార్టీ ఆరోపణ

**హైదరాబాద్ జూన్ 1(ప్రజావినికిడి):** తెలంగాణలో పవన్ కల్యాణ్ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ'కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై జనసేన పార్టీ తీవ్రంగా స్పందించింది. **మిగతా 2లో...**



## అమెరికాతో చర్చలకు ఇరాన్ బ్రేక్

లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులే ఇందుకు కారణం

- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఇరాన్ ఆరోపణ
- పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని హెచ్చరిక



## ప్రతికూల శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



# గుడిసెలు లేని గూడేలే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

3500 ఇండ్లతో పాటు ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా 21 వేల ఇండ్లు మంజూరు చేశాం. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడదలచుకున్నా. ఇండ్లు లేని వారి లిస్టు తయారు చేసి మాకు ఇవ్వండి. ఇండ్లు ఇచ్చే బాధ్యత మాది. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి గిరిజన గూడేల్లో ఇండ్లు మంజూరు చేస్తాం. ఆదిలాబాద్ జిల్లాలోని గూడేల్లో ఒక్క గుడిసె కూడా కనిపించొద్దు.. గూడేల్లో అవసరమైన ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా. ఇందిరమ్మ బిల్లుల విడుదలలో ఒక్క రోజు కూడా జాప్యం చేయలేదు. ఏడాదిలో లక్ష ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు చేసుకున్నాం. 2026 సెప్టెంబరు 17న మరో లక్ష ఇండ్లకు గృహ ప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశిస్తున్నా. రెండో విడతలో భాగంగా మరో 2.50 లక్షల ఇండ్లకు శ్రీకారం చుట్టాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సోమవారం ప్రజా పాలన- ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు కొ౦తారి గ్రామంలో పైలాన్‌ను ఆవిష్కరించి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధి కారులు, లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు చేపట్టారు.
అనంతరం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లా డుతూ..



తమ ప్రభుత్వంలో మొట్టమొదటి ప్రాధాన్యత ఆదిలాబాద్‌కు ఇస్తామని పీసీసీ అధ్యక్షుడిగా ఆనాడే చెప్పానని, ఆదివాసీ గూడేలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తమ ప్రభుత్వం భావించిందని అన్నారు. రాష్ట్రంలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇండ్లతోపాటు గూడేల కోసం అదనంగా ఇండ్లు మంజూరు చేశామన్నారు. గూడేల కోసం ప్రత్యేకంగా 21 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఈ ఏడాదిలో రాష్ట్రంలో లక్ష మంది ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్నామని అన్నారు. వచ్చే ఏడాది ఇదే తారీఖున అన్ని గూడేల్లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిం చుకుని పండుగ చేసుకుందామన్నారు. గూడేల్లో ఇండ్లు లేని పేదలను గుర్తించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని మంత్రి పొంగులేటికి సూచిస్తున్నామని తెలిపారు. పాత ఇందిరమ్మ ఇండ్లకు గోడలు బాగున్నా పైకప్పు పాడై కొందరు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి స్లాబ్ వేసు కునేందుకు అదనంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సభకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షత వహించారు.



రూ.112.14 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుతోపాటు ఆసిఫాబాద్‌లో మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కౌటాలలో కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. చింతలమనేపల్లి, గుడ్లబోరి, సిర్‌పూర్ కాగజ్ నగర్ లోని కాపువాడలో, సిర్పూర్(టి) మండలం చింతకుంటలో, కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్‌లో కెవి సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. రెబ్బెన మండలం నంబాల గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలవగా, అమ్మాయిల విభాగంలో అరోహి దేశ్‌పాండే అత్యధిక ర్యాంకును సాధించారు.
కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్ఎల్)లో శుభమ్ కుమార్ 360 మార్కులకు గాను 330 మార్కులు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఫలితాల్లో ఐఐటీ ఢిల్లీ జోన్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. శుభమ్ కుమార్ తర్వాత, అదే జోన్‌కు చెందిన కబీర్ చిల్లార్, జతైన్ చాహర్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి తమ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. ఈసారి దేశవ్యాప్తంగా కోటా కోచింగ్ సెంటర్ల ఖ్యాతి మరోసారి పెరిగింది. శుభమ్ కుమార్ ప్రదర్శనతో కోటా మరోసారి ఐఐటీ-జేఈఈ శిక్షణలో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

**విజయంపై టాపర్, కుటుంబ సభ్యుల స్పందన**

తన విజయంపై శుభమ్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. "ఈ ప్రయాణం చాలా సంతృప్తినిచ్చింది. ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించడం చాలా ఉత్సాహంగా, సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఈ పరీక్ష రాసే ఆశావహులందరికీ నేను చెప్పేది ఒక్కటే.. కఠోర శ్రమ, పట్టుదలతో స్థిరంగా చదవాలి," అని మీడియాకు తెలిపారు. శుభమ్ విజయం పట్ల అతని తల్లిదండ్రులు గర్వంగా స్పందించారు. అతని తల్లి కంచన్ మాట్లాడుతూ, "శుభమ్ మొదటి నుంచి చాలా కష్టపడి చదివేవాడు. అతని ప్రిపరేషన్ సమయంలో టీచర్లు ఎంతో సహకరించారు. వాడు జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్‌గా నిలిచినందుకు మేము గర్వపడుతున్నాం. అతని కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది," అని అన్నారు. శుభమ్ తండ్రి కూడా స్పందిస్తూ, "ఇది మాకు చాలా పెద్ద విజయం. ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ కోసం నా కొడుకు చాలా కష్టపడ్డాడు. చదువులో ఎప్పుడూ అంకితభావంతో, శ్రద్ధగా ఉండేవాడు," అని తన ఆనందాన్ని పంచుకున్నారు.

**పరీక్ష గణాంకాలు, తదుపరి ప్రక్రియ**

అధికారిక డేటా ప్రకారం, జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 కోసం 1,87,389 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, మే 17న జరిగిన రెండు పేపర్లకు 1,79,694 మంది హాజరయ్యారు. వీరిలో 56,880 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అర్హత పొందిన వారిలో 10,107 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ పరీక్ష దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో ఒకే రోజు రెండు సెషన్లలో జరిగింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పేపర్ 2 నిర్వహించారు.
అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక జేఈఈ అడ్వాన్స్‌డ్ పోర్టల్‌లో చూసుకోవచ్చు. తమ రిజిస్ట్రేషన్ లేదా రోల్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ ఉపయోగించి లాగిన్ అయి స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అడ్మిషన్, కౌన్సెలింగ్ ప్రక్రియలో స్కోర్‌కార్డ్ ప్రింటెడ్ కాపీ అవసరం కాబట్టి, దానిని భద్రపరుచుకోవాలని సలహా ఇచ్చారు.
జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జోసా) నిర్వహించే కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాల్గొంటారు. ఈ స్కోర్ ఆధారంగా ఐఐటీ బాంబే, ఢిల్లీ, మద్రాస్, కాన్పూర్, ఖరగ్‌పూర్, రూర్కీ, గౌహతి వంటి దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలలో అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. అర్హత సాధించని విద్యార్థులు నిరాశ చెందకుండా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర ప్రముఖ ప్రభుత్వ ఇంజినీరింగ్ సంస్థలలో ప్రవేశాలకు ప్రయత్నించవచ్చు.

# నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మొదటిపేజీ తరువాయి**

ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో గవర్నర్, ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, వీఐపీలు, వీవీ ఐపీలు, ప్రముఖులతోపాటు నగరవాసులు పాల్గొంటున్నారు. దాంతో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుమారు 1140 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సివిల్ విభాగం నుంచి 507, ట్రాఫిక్ విభాగం నుంచి 358, సీఎస్‌డబ్ల్యు, ఏఆర్, టీజీఎస్‌పీతోపాటు అదనపు బలగాలను మోహరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ముగ్గురు డీసీపీలు, నలుగురు అదనపు డీసీపీలు, 8 మంది ఏసీపీలు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తారని మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి తెలిపారు. 49 మంది సీఐలు, 88 సబ్ఇన్‌స్పెక్టర్లు, 723 మంది పోలీస్ సిబ్బందితోపాటు ఎస్‌వోటీ, అక్టోపస్ బృందాలు, ఎస్‌బీ, ఐటీ సెల్ బృందాలు పనిచేస్తామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ బృందాలను రంగంలోకి దించామన్నారు. డాగ్‌స్క్వాడ్స్, బాంబ్ స్క్వాడ్స్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. మారుణాయుధాలు, ప్రమాదాలకు అస్కారం కల్గిన వాటిని లోనికి అనుమతించబోమన్నారు. ప్రతి ఒక్కరిపైనా నిఘా ఉంటుందని, అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, నగర వాసులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. పాసులున్న వారు పోలీసులు సూచించిన విధంగా పార్కింగ్ ఏరియాలో వాహనాలను పార్క్ చేసి లోనికి వెళ్లాలని కోరారు. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

# ఉద్యోగుల బదిలీలపై నిషేధం

## ప్రత్యేక సందర్భాల్లో మినహాయింపు -ఉత్తర్వులు విడుదల

**హైదరాబాద్ జూన్ 1(ప్రజావినికిడి):**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు (జీఓ నెంబర్ 57ను) విడుదల చేశారు. గతంలో మే 1 నుంచి మే 31 వరకు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం సడలించిన విషయం తెలిసిందే. ఆ గడువు ముగియడంతో ఈనెల ఒకటి నుంచి మళ్లీ పూర్తి స్థాయిలో బదిలీలపై నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే ప్రత్యేక సందర్భాల్లో మినహాయి ంపులుంటాయని తెలిపింది. పదోన్నతుల కారణంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి వచ్చినప్పుడు మాత్రమే పోస్టింగ్‌లు ఇవ్వొచ్చని సూచించింది. అయితే ఇతర ఉద్యోగులకు స్థానచల నం కలిగించకుండా ఉన్న ఖాళీల్లోనే నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. పోస్టుల రద్దు, రివర్షన్‌లు, రిపాట్రియేషన్‌లు, విదేశీ సేవల నుంచి తిరిగి రావడం, క్రమశిక్షణా చర్యల నేపథ్యంలో ఉద్యోగుల పోస్టింగ్‌లు అవసరమైతే వాటిని కూడా ఖాళీ పోస్టుల్లోనే చేపట్టాలని పేర్కొం ది. ఆరు నెలలకు మించి దీర్ఘకాలిక సెలవుల నుంచి తిరిగి విధుల్లో చేరే ఉద్యోగులకు కూడా ఖాళీగా ఉన్న పోస్టుల్లోనే నియామకాలు ఇవ్వాలని ఉత్తర్వు ల్లో స్పష్టం చేసింది. సెలవు కారణంగా ఏర్పడిన ఖాళీ లను బదిలీల ద్వారా భర్తీ చేయరాదని పేర్కొంది.

**ఆరు నెలల పాటు సడలింపులకు అవకాశం లేదు**

ఈనెల ఒకటి నుంచి ప్రారంభమయ్యే ఆరు నెలల కాలానికి బదిలీల నిషేధంపై ఎలాంటి సడలింపు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోబోదని ఉత్తర్వుల్లో తెలిపింది. ఆ తర్వాత ఏవైనా మినహాయింపులు ఇవ్వాల్సి వస్తే సంబంధిత పరిపాలనా శాఖలు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుమతులతో మాత్రమే ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని పేర్కొంది. ఖాళీల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి పరిపాలనా అవసరాల దృష్ట్యా ఖాళీలను భర్తీ చేయాల్సి వచ్చినప్పుడు, ప్రస్తుత కార్యాలయంలో కనీసం ఒక ఏడాది సేవ పూర్తి చేసిన ఉద్యోగులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేసింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే జీతాల బిల్లులు నిలిపివేత**

ఉత్తర్వులకు విరుద్ధంగా చేపట్టిన బదిలీలకు సంబంధించిన ఉద్యోగుల జీతాల బిల్లులను ట్రెజరీలు, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలు ఆమోదించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని శాఖలు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కోరింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం లేదు.

# జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 11 వరకు గడువు ఉంటుంది. జూన్ 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల్లో మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.
ఇక శాసనమండలి ఎన్నికల విషయానికొస్తే, బీహార్‌లో 9, కర్ణాటకలో 7 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. అలాగే బీహార్‌లో నితీశ్ కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన ఒక ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది.

# కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ నీట్-కు సుప్రీం నో !

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 21న తాజా విచారణ జరగాల్సి వుంది. పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన బెంచ్ తిరస్కరించింది. జులై వరకు ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆర్‌జెడి ఎంఎల్ఏ సుధాకర్ సింగ్ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించింది. సిబిటి తరహాలో పరీక్ష నిర్వహిస్తే పేపర్ లీక్ అయ్యే సమస్య తలెత్తదని పిటిషనర్ వాదించారు. ఇంత తక్కువ కాల వ్యవధిలో పరీక్షను మళ్లీ నిర్వహించడంలో వుండే ఇబ్బందులను ప్రస్తావిస్తూ, వారికి వుండే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని సిబిటి లాంటి అంశాలను తోసిపుచ్చినట్లు బెంచ్ తెలిపింది. పేపర్ లీకయినప్పటికీ మళ్లీ పెన్ను పేపర్ తరహాలోనే పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారా అని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశ్నించగా, పరీక్షల నిర్వహణా అధికారులు ఎదుర్కొనే రవాణా పరమైన ఇబ్బందులను కూడా బెంచ్ ప్రస్తావించింది. అయినా పిటిషనర్ పట్టుబడుతుండడంతో తక్షణమే ఈ అంశాన్ని విచారించలేమని కోర్టు తెలిపింది. కోర్టు పాక్షిక పని దినాలు ముగిసిన తర్వాత దీనిని విచారణకు పెట్టాలంటూ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల తర్వాత విచారిద్దామని బెంచ్ తెలిపింది. ఎన్‌టిఎ పనితీరులో, పోటీ పరీక్షల నిర్వహణలో విస్తృత సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దాఖలై, పెండింగ్‌లో వున్న పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌ను కూడా కలిపారు.

# పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ...

ప్రభుత్వ చర్య పూర్తిగా అర్థరహితమని, రాజకీయ దురుద్దేశంతోనే తమ కార్యక్రమాన్ని అడ్డుకున్నారని పార్టీ వర్గాలు ఆరోపించాయి. వివరాల్లోకి వెళితే, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం' పేరిట ఓ ఇండోర్ కార్యక్రమం నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. సుమారు 2000 మంది పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం తలపెట్టారు. రాష్ట్ర అభివృద్ధిలో జనసేన పాత్ర, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతం వంటి అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అయితే, పార్కింగ్ సమస్యను కారణంగా చూపుతూ ప్రభుత్వం ఈ సభకు అనుమతి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని జనసేన తీవ్రంగా తప్పుబట్టింది. నిత్యం ఎన్నో సాంస్కృతిక, రాజకీయ, కార్పొరేట్ సమావేశాలు జరిగే సంధ్య కన్వెన్షన్‌లో, కేవలం తమ కార్యక్రమానికే పార్కింగ్ సమస్యను కారణంగా చూపడం సహేతుకం కాదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల వివాదం ముగిసిపోయిన అధ్యాయమని, ఆయనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని జనసేన గుర్తుచేసింది. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఉండబోవని స్వయంగా పవన్ కల్యాణ్ స్పష్టం చేశారని వెల్లడించింది. అయినప్పటికీ, ఆ వ్యవహారాన్ని సాకుగా చూపి సభను అడ్డుకోవడం సరికాదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# అమెరికాతో చర్చలకు ఇరాన్ బ్రేక్

**న్యూఢిల్లీ జూన్ 1(ప్రజావినికిడి):**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులను తీవ్రతరం చేయడంతో, అమెరికాతో జరుపుతున్న చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో ప్రాథమిక ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న సందేశాల మార్పిడికి బ్రేక్ వేసింది. ఈ విషయాన్ని ఇరాన్‌కు చెందిన తస్నీమ్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ నేరాలు కొనసాగిస్తుండటమే తమ నిర్ణయానికి కారణమని ఇరాన్ స్పష్టం చేసింది. "కాల్పుల విరమణకు లెబనాన్‌పై దాడులు చేయకూడదన్నది కూడా ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ లెబనాన్‌తో సహా అన్ని అంశాల్లోనూ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అందుకే మధ్యవర్తిత్వం ద్వారా జరుగుతున్న చర్చలను, సందేశాల మార్పిడిని ఇరాన్ చర్చల బృందం నిలిపివేస్తుంది" అని తస్నీమ్ నివేదిక పేర్కొంది. ఈ పరిణామంపై అంతకుముందు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ తీవ్రంగా స్పందించారు. ఇజ్రాయెల్ దాడులకు తగిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాలకు వర్తిస్తుందని, ఏ ఒక్కచోట ఉల్లంఘన జరిగినా, అది అన్నిచోట్లా జరిగినట్టేనని వ్యాఖ్యానించారు. దీని పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని అరాఘ్చీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.
అమెరికాతో చర్చల్లో దేశ ప్రతినిధిగా ఉన్న ఘలీబాఫ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం విధించడం, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు చేయడం ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ప్రతి చర్యకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఆయన హెచ్చరించారు.

# ప్రతికూల శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

## ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్‌జూన్ 1(ప్రజావినికిడి):**



రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.
రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ఆయన స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ మేరకు కేసీఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని హెచ్చరించారు. ప్రతీప శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని తెలిపారు. తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోవాలనీ, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కోరారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 2 జూన్ 2026

# ఎన్జీవోస్ కాలనీ సెక్టర్ 5 అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు మొద్దు లచ్చి రెడ్డి కి కృతజ్ఞతలు

**ఎన్జీవోస్ కాలనీ సెక్టర్ 5 కాలనీ సభ్యులు**



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ సెక్టర్ 5 అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినందుకు అలాగే నూతన రోడ్డు నిర్మాణానికి కృషి చేసినందుకు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి కాలనీ సభ్యులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు,నాయకులు సుధీర్ కుమార్ మరియు కాలనీ సభ్యులు రాజగోపాల్ రెడ్డి, కమలా ప్రసాద్, కుసుమ కుమారి, సమీర్ ఠాగూర్, మాధవి భాయ్, మురళి, అనురాధ,అశోక్, అనురాధ, వెంకటేశ్వర్, కళ్యాణి,శ్రీనివాస రేఖ,సాయి రెడ్డి ఉమా,బేబీ, ప్రదీప్,లక్ష్మి, సులోచన, అనురాధ, జాన్సన్,శేఖర్, రమేష్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2,2026 మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, కొంగరకలాన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సోమవారం పరిశీలించారు."తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఈ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలి.ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఏర్పాటును ముందుగానే పరిశీలించి పూర్తి చేయాలి" అని అన్నారు.వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఎగ్జిబిషన్‌లోఅదృష్టవంతుడికి అయోధ్య దర్శనం

**లక్కీ డ్రాలో గెలిచి నలుగురు కుటుంబ సభ్యులతో ఉచిత విమాన ప్రయాణం**

**కె ఎస్ హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఫర్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు కార్తీక్ శ్రీనివాస్ వెల్లడి**

**జూన్ ఒకటవ తారీకు బల్కంపేట వాస్తవ్యుడు నాగేందర్ లక్కీడ్రా లో గెలుపు**



**హైదరాబాద్, (ప్రజావినికిడి):** ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్శకులకు వినూత్నంగా ఆధ్యాత్మిక యాత్రను బహుమతిగా అందిస్తూ కేఎస్ హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ నిర్వాహకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ నెక్సస్ మాల్ వెనుక నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతి సోమవారం నిర్వహించే లక్కీ డ్రా ద్వారా విజేతలకు అయోధ్య దర్శనం కల్పించే కార్యక్రమం సందర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.ఎగ్జిబిషన్ నిర్వాహకుడు కార్తీక్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అయోధ్యలోని శ్రీరామ మందిరాన్ని తలపించేలా ప్రత్యేక సెట్‌ను ఏర్పాటు చేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఎగ్జిబిషన్ టికెట్ కొనుగోలు చేసి సందర్శించిన వారిలో ప్రతి వారం ఒక అదృష్టవంతుడిని ఎంపిక చేసి, అతని కుటుంబంలోని నలుగురు సభ్యులకు అయోధ్య వెళ్లి రావడానికి ఉచిత విమాన టికెట్లను అందిస్తున్నట్లు వెల్లడించారు.
జూన్ 1న నిర్వహించిన లక్కీ డ్రాలో బల్కంపేటకు చెందిన మెడికల్ షాప్ నిర్వాహకుడు నాగేందర్ విజేతగా నిలిచారు.లక్కీ డ్రా ఫలితాలు ప్రకటించగానే అక్కడి సందర్శకులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అయోధ్య యాత్రకు ఉచిత విమాన టికెట్లు లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని నాగేందర్ తెలిపారు. సాధారణంగా ఎగ్జిబిషన్‌లలో వస్తువుల కొనుగోళ్లకు మాత్రమే పరిమితమయ్యే ఆఫర్లకు భిన్నంగా, భక్తి,



కుటుంబ ఆనందాన్ని కలిపి అయోధ్య దర్శనం అవకాశం కల్పించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సందర్శకులకు మరపురాని అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న ప్రజలు కూడా ఈ వినూత్న ఆలోచనను స్వాగతిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి ఆధ్యాత్మిక యాత్ర అవకాశాలను అందిస్తాయని అభిప్రాయపడుతున్నారు. అయోధ్య దర్శనం కోసం లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేయడం ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చర్చనీయాంశంగా మారింది.


# హస్తినాపురం డివిజన్ లో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
సోమవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ ఫేజ్-2,ద్వారకా తిరుమల కాలనీవాసుల కోరిక మేరకు ఆట్టి కాలనీ నందు కాలనీవాసులచే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, ద్వారకా తిరుమల కాలనీ (హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ ఫేజ్-2) కాలనీలోని పార్కు గేటుకు సంబంధించి ప్రస్తుతం నెలకొన్న ఒక ముఖ్యమైన సమస్యను పరిష్కారం చేయాలనీ కోరారు.కాలనీ పార్కుకు గతంలో ఉన్న గేటు వల్ల కాలనీవాసులందరికీ ఎంతో రక్షణగా,సౌకర్యవంతంగా ఉండేదని,అయితే ప్రస్తుతం కొద్దిమంది కాలనీ సభ్యులు ఆ గేటు ఏర్పాటును వ్యతిరేకిస్తుండగా,అత్యధిక శాతం మంది కాలనీవాసులు మాత్రం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆ గేటును ఖచ్చితంగా కొనసాగించాలని కోరారు. ఈ పార్క్ గేటును యథావిధిగా ఉంచాలని కోరడానికి ప్రధాన కారణం ఏమిటంటే వర్షపు నీటి సమస్య మా కాలనీలో లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఇళ్లలోకి వర్షం వచ్చినప్పుడు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ గేటు ఉండటం వల్ల వర్షపునీటి ప్రవాహాన్ని నియంత్రించి,ఆ ఇళ్లలోకి నీరు రాకుండా అడ్డుకోవడానికి వీలవుతుంది,చెత్తాచెదారం,పరిశుభ్రత గేటు లేకపోవడం వల్ల బయటి వ్యక్తులు పార్కు పరిసరాల్లో కాలనీ రోడ్లపై విచ్చలవిడిగా చెత్త వేస్తున్నారు. దీనివల్ల తీవ్ర దుర్వాసన,దోమల బెడద పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని,గేటు ఉంటే ఈ సమస్యను అరికట్టవచ్చని తెలిపారు. వృద్ధులు ప్రజల సౌకర్యం కాలనీలోని వృద్ధులు,మహిళలు మరియు చిన్న పిల్లలు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రశాంతంగా సురక్షితంగా వాకింగ్ చేయడానికి అదేవిదంగా సమయం గడపడానికి ఈ గేటు ఎంతో అవసరం అని గేటు ఉండటం వల్ల అనవసరమైన వాహనాల రాకపోకలను నియంత్రించి,కాలనీలో దొంగతనాలు జరగకుండా భద్రతను పెంచవచ్చని,కొంతమంది వ్యక్తిగత కారణాల వల్ల దీనిని వ్యతిరేకిస్తున్నప్పటికీ,అత్యధిక శాతం మంది ప్రజల క్షేమం లోతట్టు ప్రాంతాల ఇళ్ల రక్షణ అలాగే కాలనీ పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న పార్కు గేటును యథావిధిగా కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అట్టి కాలనీ మరొక వర్గ సభ్యులు మాట్లాడుతూ ఇట్ గేటు పెట్టడం వల్ల సాయంత్రం పూట అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిందని ఆరోపించారు.
కావున గేటు పెట్టకుండా గోడ కట్టాలని తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి ఇరువురి వాదనలు విన్న తర్వాత ఇట్టి గేటు విషయంలో ఒకరి మీద ఒకరికి కోపాలు వద్దని తెలిపారు. స్థానిక జి. హెచ్. ఎం. సి. అధికారులతో ఫోన్లో మాట్లాడి ఇట్టి కాలనీ నందు పర్యటించి ఇరువురితో మాట్లాడి ఏ విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందో మాట్లాడి అనంతరం తగు చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు సూచించారు. దానికి ఇరువురు ఒప్పుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన భూ బాధితుడు

**నాంపల్లి,(ప్రజా వినికిడి):**
సిద్దిపేట జిల్లా చేర్యాల్ మండలం శాబాష్ గూడెం గ్రామంలో చోటుచేసుకున్న భూమి వివాదం నేపథ్యంలో పోలీసుల ప్రవర్తనపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తమకు జరుగుతున్న అన్యాయంపై స్పందించి తక్షణ న్యాయం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.
బాధితుడు గజ్జి కనకయ్య మాట్లాడుతూ సర్వే నంబర్లు 667/B1,650/A1,651/E1, 670/A1లో కలిపి సుమారు 2 ఎకరాల 13 గుంటల భూమి తనకు సంబంధించినదని, ఆ భూమిని తన భార్య గజ్జి కవిత పేరుపై చేర్యాల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చట్టబద్ధంగా నమోదు చేయించుకున్నట్లు తెలిపారు.అయితే గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వలేదనే కారణంతో గ్రామ సర్పంచ్ మేరబోయిన శైలం కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఏప్రిల్ 14,2026న మా భూమిలో బోరు వేస్తుండగా తమ భూమికి సంబంధం లేని గజ్జి కృష్ణమూర్తి, శ్రీరాముల కనకయ్య,సర్పంచ్ మెరబోయిన శ్రీశైలం కలిసి అకారణంగా మా యొక్క



భూమిలో బోరు వేస్తుండగా మధ్యలో ఆపి దౌర్జన్యం చేశారు. అడిగితే తమపై దాడి చేసి, దూషణలకు పాల్పడి, ప్రాణహాని కలిగించేలా బెదిరించారని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే 100 నెంబర్‌కు సమాచారం ఇచ్చి కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రారంభంలో పోలీసులు భూమి తమదేనని నిర్ధారించినప్పటికీ, తరువాత కేసును సివిల్ వివాదంగా ముగిస్తున్నట్లు కానిస్టేబుల్ రాజయ్య ఫోన్ ద్వారా తెలియజేశారని బాధితులు తెలిపారు. అనంతరం మే 22, 2026న మళ్లీ పోలీస్ స్టేషన్‌కు రావాలని పిలిచిన నేపథ్యంలో గ్రామ పెద్దలతో కలిసి వెళ్లగా కానిస్టేబుల్ రాజయ్య,ఎస్ఐ మహేష్ కలిసి తమ కుటుంబ సభ్యులతో అమర్యాదకరంగా ప్రవర్తించి, లాఠీలతో బెదిరించి తప్పుడు న్యూసెన్స్ కేసులు పెడతామని హెచ్చరిస్తూ స్టేషన్ నుంచి వెళ్లగొట్టారని తెలిపారు.గ్రామ సర్పంచ్ మేరబోయిన శ్రీశైలం,శ్రీరాముల కనకయ్య,గజ్జి కృష్ణమూర్తి వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, వారిపై తక్షణ చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు.

# ప్రజల సమస్యలు ప్రజా ప్రతినిధులు పట్టించుకోరా

**2021 నుండి రహదారి నిర్మాణానికి అడ్డంకులు చోద్యం చూస్తున్న పాలకులు, ప్రజాప్రతినిధులు**

**సమస్య పరిష్కారం చేయకపోతే ఆందోళన కొనసాగిస్తాం.. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ దావుద్..**





**వాజేడు,జూన్ 2,(ప్రజావినికిడి):**
వాజేడు మండలం లో చెరుకూరు ధర్మవరం ఆర్ అండ్ బి రహదారి నిర్మాణం చేపట్టకపోవటం తో గుంతలు ఏర్పడి,ఇరుకు రోడ్డు లో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు ఇంకా అనేక మంది నానా ఇబ్బందులు పడుతున్నారు అని అయినా ప్రభుత్వం,ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని సిపిఎం జిల్లా కార్యవర్గ వర్గ సభ్యులు ఎండీ దావుద్ మాట్లాడుతూ అన్నారు సోమవారం చెరుకూరు -ధర్మవరం ఆర్ అండ్ బి రహదారి దిగ్బందన కార్యక్రమం లో పాల్గొని వారు మాట్లాడుతూ 2021 లో ఎల్ డబ్యూ ఈ నిధులలో 13 కోట్ల రూపాయలు ఆ నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే 3 కిలో మీటర్ల రోడ్డు మాత్రమే ఆపివేశారు అని రోడ్డు నిర్మాణం చేపట్టాలి అంటే 47,50,000 రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని లేని యడల నిర్మాణం చేపట్టేది లేదని ఆపివేశారు అని, ఇప్పుడు అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నష్టం పరిహారం ఇవ్వకుంట,అటవీ శాఖ అధికారులతో మాట్లాడకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని వారు మాట్లాడుతూ అన్నారు రోడ్డు నిర్మాణం కోసం జిల్లా మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ ను కలిసి విన్నవించుకున్న ఏ మాత్రం ఫలితం లేదని,సమస్య పరిష్కారం చేయకుంట కాలయాపన చేస్తున్నారు అని ఇది ఎంత వరకు సరైంది కాదని వారు మాట్లాడుతూ అన్నారు. ఈ మండలం లో ఉన్న కాంగ్రెస్ నాయకులు సర్పంచులు ఎందుకని రోడ్డు సమస్య పై ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లాటం లేదని,అటవీ శాఖ చైర్మన్ ఈ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అయి ఉండికూడా అటవీ శాఖ తో ఎందుకని మాట్లాడటం లేదని సమస్య పరిష్కారం కోసం ఎందుకు చొరవ చూపటం లేదని వారు మాట్లాడుతూ, అన్నారు సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ,కేర్ర గుట్టలలో 40 కిలో మీటర్ల రోడ్డుకు అటవీశాఖ కి ఎంత నష్ట పరిహారం చెల్లించరో అటవీశాఖ వెల్లడించాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆధాని, అంబానీలకు ఒక న్యాయం,పేద ప్రజలకు ఒక న్యాయం నా అని వారు మాట్లాడుతూ అన్నారు. 10 రోజుల నుండి ఆందోళన చేస్తున్న ఈ ప్రభుత్వం కు చీమకుట్టినట్లు కూడా లేదని, గ్రామపంచాయతి తీర్మానం చేయాలనీ సర్పంచ్ లకు వినతిపత్రం ఇచ్చిన ఫలితం లేదని ఫారెస్ట్ అధికారులను జిల్లా ఉన్నత అధికారులను ఎందుకని ప్రశ్నించటం లేదని సమస్య పరిష్కారం కోసం ఎందుకు ఆందోళన బాట పట్టటం లేదని వాళ్లకు ఉన్న అధికారాలను ఎందుకు ఇపయోగించటం లేదని వారు మాట్లాడుతూ అన్నారు.
సమస్య పరిష్కారం కు పునుకోకపోతే ఈ ప్రాంత బంద్ తో పాటు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తా రోకో కార్యక్రమం చేపడతాం అని ఎట్టి పరిస్థితి లో రోడ్డు సమస్యను వదిలి పెట్టె ప్రసక్తే లేదని వారు మాట్లాడుతూ అన్నారు.
రోడ్డు సమస్య పరిష్కారం కోసం చెరుకూరు ధర్మవరం రహదారిపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని బలవంతగా పోలీసులు అరెస్ట్ చేయటం కార్యక్రమం ను విచ్చిన్నం చేయటం సరైంది కాదని మా శాంతి యుత ఆందోళనను అడ్డుకోవటం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని రఘుపతిరావు మాట్లాడుతూ అన్నారు.
ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు జజ్జరి దామోదర్,బచ్చల క్రిష్ణబాబు, గౌరారపు చంద్రశేఖర్,గార సదక్రిన్,భోగట సత్యం, బలుసుపాటి నరేష్ కుర్సం ప్రవీణ్,పుల్లూరి యశోద, శాంతకుమారి,జజ్జరి ఆదినారాయణ తదితరలు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అందరూ "ఆకాశంలో ఒక తారలే"


## సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా పాటల పూతోటలో విహరించిన గాయనీ గాయకులు..


**చైతన్య హబ్ కిషోర్ దా ఆడిటోరియంలో "శ్రీ సరస్వతీ కళాపీఠం" కార్యక్రమం..**

**పాటలతో అదరగొట్టిన, బాలగంధర్వులు, గాయనీ గాయకులు..**

**ముఖ్య అతిథులుగా కృష్ణ మహేష్ ప్రజాసేన ఆల్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరీ, సీనియర్ నేత వీరాభిమాని తాండ్ర శ్రవణ్ రెడ్డి..**

**మురిపించిన చిన్నారులు.. మైమరపించిన పాటలు..**




శరణ్యక్షితను సన్మానించి నగదు పురస్కారం ని అందజేస్తున్న వేణుగోపాల్ మధిర



**తాండ్ర శ్రవణ్ రెడ్డిని సన్మానిస్తున్న శ్రీ సరస్వతి కళా పీఠం నిర్వాహకులు**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** అక్షరాలతో పాటకు ప్రాణం పోసి.. సంగీతంతో స్నానం చేయించి.. స్వరాలతో ముస్తాబు చేసి.. ఆనాటి సినీ ప్రముఖులు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా రూపొందించిన పాటలను మరోసారి తమ స్వరాలతో నేటి తరాలకు అందజేస్తుంది "శ్రీ సరస్వతి కళా పీఠం" (ఎస్.ఎస్.కే.పి). హైదరాబాద్ - విజయవాడ కేంద్రంగా ఎం.వి.జీవి రావు, రోజా మధిర దంపతులు ఏర్పాటు చేసిన ఈ కళా పీఠం ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ హిమాయత్ నగర్ లో గల చైతన్య హబ్ కిషోర్ దా ఆడిటోరియంలో ఈ పాటల పూతోటను ఏర్పాటు చేశారు. పదేళ్ల చిన్నారి మొదలుకొని ఏడు పదులు దాటిన వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ చూడ చక్కని సూపర్ స్టార్ కృష్ణ సినిమాలలోని ప్రత్యేక గీతాలను అదేవిధంగా ఇతర చిత్రాల గీత మాలికలతో అలరించారు.కళా పీఠానికి ముఖ్య సలహాదారుగా ఉన్న జర్నలిస్టు కేపీ ఈ కార్యక్రమానికి అన్నీ తానై వ్యవహరించారు. ఎప్పటిలాగే నిర్వాహకురాలు, గాయకురాలు, ముఖ్యంగా ఈల పాటలలో రికార్డు సృష్టించిన రోజా మధిర తన ఈల పాటతో కృష్ణా ముకుందా మురారి..అనే భక్తి పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎప్పటిలాగే అందరి చేత తన ఈల పాటతో కరతాళ ధ్వనులు చేయించారు.ఆల్ ఇండియా కృష్ణ, మహేష్ ప్రజా సేన అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరి, కాంగ్రెస్ సీనియర్ నేత కాంగ్రెస్ తాండ్ర శ్రవణ్ రెడ్డి, మహానటి సావిత్రి కళా పీఠం నిర్వాహకురాలు పరుచూరి విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కేపీతోపాటు, గాయకులు రత్నకుమారి, దుర్గాప్రసాద్, రమణి,మోహన్, విష్ణు ప్రియ, ఉదయ భాస్కర్, మోహన్,ఆనంద్, లాంటి గాయకులతో పాటు పదేళ్ల చిన్నారి అక్షర, ఇంటర్మీడియట్ బాలికలు శరణ్యాక్షిత, మనస్విని, అస్మితా రెడ్డి తమ పాటలతో సంపూర్ణంగా అలరించారు.

### ప్రతిపాట ఆణిముత్యమే..

సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయనకు నివాళిగా అత్యధిక గీతాలు ఆయనకు సంబంధించినవి పాడగా,ఇతర చిత్రాల పాటలను కూడా పాడి అలరించారు. నమస్తే.. సుస్వాగతం.. వీక్షకులకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా సాగిన జర్నలిస్ట్ కేపీ,విష్ణుప్రియలు పాడిన పాటతో మొదలైన ఈ కార్యక్రమంలో మెరుపులా మెరిశావు.. మౌనమేలనోయి.. మా ఊర్లో ఒక పడుచుంది.. దయ్యమంటే భయం అన్నది.. అభినందన మందారమాల.. రెక్కలు తొడిగి రెపరెపలాడి.. చినుకులారాలి.. ఆకాశంలో ఒక తార.. ఆనందోబ్రహ్మ.. ప్రియతమా నీ ఊపిరే నాకు ప్రాణం,ఇలాంటి హుషారైన పాటలతో పాటు.. నీలి కన్నుల నీడలలోన.. చుక్కలతో చెప్పాలని..నీలో విరిసిన అందాలన్నీ.. హిమగిరి సొగసులు.. రాగమయి రావే.. అనురాగమయి రావే..నడిరేయి ఏ జాములో.. సామజ వర గమన లాంటి పాత పాటలు..రాణి ఓ రాణి లాంటి హాస్య గీతాలు..హాయి హాయిగా ఆమని సాగే..లలిత ప్రియ కమలం..ఇలాంటి పాడిన గాయకులనే సవాలు చేసిన పాటలు.. ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా నిర్విరామంగా సాగిన ఈ కార్యక్రమంలో ఎన్నెన్నో మధుర గీతాలు మనసును తాకాయి..హుషారైన గీతాలు ఉత్తేజాన్ని కలిగించాయి.. భావ గీతాలు మురిపించి మైమరిపించాయి.

### అదరగొట్టిన గాయనీ గాయకులు..

సూపర్ స్టార్ కృష్ణ అలాగే ఇతర చిత్రాల నుంచి అగరగొట్టే పాటలను అందరూ గాయనీ గాయకులు ఈ కార్యక్రమంలో తమ స్టైల్ లో అదరగొట్టారు. అద్భుతమైన పాటలను ఎంపిక చేసి వాటిని పాడి నూటికి నూరు శాతం అలరించారు. ముఖ్యంగా చిన్నారి శరణ్యాక్షితతో కేపీ కలిసి పాడిన సింహాసనంలోని ఆకాశంలో ఒక తార..కార్యక్రమ టైటిల్ సాంగ్ వీక్షకులను పాట లేచి నిలబెట్టి చప్పట్లు కొట్టించింది.అలాగే చిన్నారి అక్షరతో కలిసి పాడిన రాణి ఓ రాణి పాట మరోసారి వేదిక మీద నవ్వులు పూయించింది. అస్మితా రెడ్డి తో పాడిన చినుకులా రాలి..విష్ణు ప్రియతో పాడిన కొంగే జారిపోతుంది.. ప్రియతమా నీ ఊపిరి నాకు ప్రాణం.. ముద్దులతో ఓనమాలు నేర్పించనా..ప్రేమ గీతం పక్కన పెట్టు..వాహవా నీ యవ్వనం.. మనస్వినితో పాడిన రెక్కలు తొడిగి రెపరెపలాడి.. జుంబారే జుంజుంబారే.. ఎక్కడో చూసిన జ్ఞాపకం..అక్షరతో పాడిన కూనలమ్మ కూనలమ్మ.. లాంటి పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చూసేవారి గుండెల్లో గూడు కట్టుకున్నాయి.. అదేవిధంగా అన్నదమ్ముల సవాల్ చిత్రంలోని నాకోసమే నీవున్నది.. ఆకాశమే అవునన్నది.. గూడుపుఠాణి చిత్రంలోని కన్నులైనా తెరవని ఓ చిన్ని పాప స్వాగతం.. ఇలాంటి పాటలు ఆకట్టుకున్నాయి.

### జోరుగా.. హుషారుగా..

కార్యక్రమం ఆద్యంతం జోరుగా హుషారుగా సాగింది..ట్రాక్ మాస్టర్ సుదర్శన్ సహ గాయకులతో కలిసి పాడిన మా ఊళ్లో ఒక పడుచుంది.. దయ్యం అంటే భయమన్నది.. పాట చప్పట్లు కొట్టించింది. అదేవిధంగా సాక్షి సినిమాలోని రారు రారు ఈ లోకం.. రారు ఎవరు నీకోసం..దేవుడు చేసిన మనుషులు చిత్రంలోని తొలిసారి నిన్ను.. చూశాను నేను పాటలు ఆకట్టుకున్నాయి. ఇక మరో గాయకులు ఉదయభాస్కర్ వేదికపై పాడుతూనే చిలిపి స్టెప్పులతో అలరించారు. గాయని మణులు రోజా మధిర, రత్నకుమారి, రమణి హరి,విష్ణు ప్రియ, దుర్గాప్రసాద్, ఆనంద్,మోహన్ తదితరులు వేదికపై పాడిన పాటలు హైలెట్ గా నిలిచాయి.

### బాలికలూ.. భళా..

ఆనాటి మధుర గాయకులే ఈ పాట పాడేందుకు తాము చాలా కష్టపడ్డాం..అని చెప్పుకున్న పాటలను మంచినీళ్ల ప్రాయంగా అవలీలగా పాడి అలరించారు బాలికలు.పదేళ్ల చిన్నారి అక్షర గురించి అందరికీ తెలుసు.తాజాగా ఈ చిచ్చరపిడుగు కు జోడిగా శ్రీ సరస్వతి కళా పీఠానికి మొదటిసారిగా విచ్చేసిన బాలికలు శరణ్యాక్షిత, మనస్విని, అస్మితా రెడ్డి ఆదివారం వేదికను పంచుకున్నారు. అద్భుతమైన పాటలతో అలరించారు. ముఖ్యంగా శరణ్యక్షిత హాయి హాయిగా ఆమని సాగే,ఆహనా పెళ్ళంట..ఓహోనా పెళ్ళంట..పాటను పాడి ఔట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్ ద్వారా చప్పట్లు కొట్టించింది.అలాగే అస్మిత లలిత ప్రియ కమలం విరిసినది అన్న పాట దుర్గాప్రసాద్ తో కలిసి పాడి ఆకట్టుకుంది.ఇక మనస్విని హిమగిరి సొగసులు.. నువ్వు నా ముందుంటే.. లాంటి పాటలతో ఆకట్టుకుంది.ఇక చిన్నారి అక్షర పాడిన పాటలు గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు.. తాను పాడిన ప్రతిపాట అలరించింది. ముఖ్యంగా బాలిక తండ్రి యాదగిరితో కలిసి పాడిన ఇది చెరగని ప్రేమకు శ్రీకారం..పాట అందర్నీ ఆకట్టుకుంది.




### సన్మానాలు.. సత్కారాలు..

కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన గాయని గాయకులందరినీ వేదికపై శ్రీ సరస్వతి కులాపీఠం నిర్వాహకురాలు రోజా మదిర, ముఖ్య అతిథి ఎండి ఖాదర్ గోరి, సీనియర్ జర్నలిస్టు కేపీ, సీనియర్ నాయకులు ఉదయభాస్కర్ చేతుల మీదుగా సత్కరించారు. అదేవిధంగా వేదికపై అద్భుతంగా పాడి అలరించిన బాలగంధర్వులు అస్మిత, శరణ్యాక్షిత, మనస్విని,అక్షర లకు నగదు పురస్కారాలు సంస్థ తరఫున అందించారు. అదేవిధంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎండి ఖాదర్ గోరి,తాండ్ర శ్రావణ్ రెడ్డి లను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎండి ఖాదర్ గోరి మాట్లాడుతూ, సూపర్ స్టార్ కృష్ణతో తనకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. నేను ఆయన కుటుంబంలో ఒక సభ్యుడిగా మెలిగాను అని, ఆయనను జీవితాంతం మర్చిపోలేనని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.తాండ్ర శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులతో పాటు సోదరుడు కెపి వర్ధమాన గాయకులను వెలుగులోకి తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం అపూర్వమని అన్నారు. అద్భుతంగా పాటలు పాడి అలరించిన చిన్నారి గాయకులకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చివరిగా రోజా మధిర మాట్లాడుతూ,ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి కొత్త కొత్త గాయకులను వెలుగులోకి తెచ్చేందుకు తమ ప్రయత్నం నిరంతరం కోనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు















# రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో (129)ఫిర్యాదులు స్వీకరణ





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, పెండింగులో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (129) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు చెందిన (28) దరఖాస్తులు, ఇతర శాఖలకు చెందిన (101) దరఖాస్తులు, మొత్తం (129 ) దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జూన్ 2 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న "పర్యావరణ పరిరక్షణ మరియు అటవీ అవగాహన వారోత్సవాలను" విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు."ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక సమర్థవంతమైన వేదిక.ప్రజల వినతులపై అధికారులు స్పందనాత్మకంగా వ్యవహరించి త్వరితగతిన పరిష్కారం చూపాలి.అదే విధంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం, పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి" అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి (రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్),వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లుసంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం..

## ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం లేదా.?



**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):**ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని బీడీరెడ్డి గార్డెన్ నుండి నంది హిల్స్ రహదారిపై భారీ అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతోందని స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు.అక్రమ నిర్మాణాల విషయంలో హైకోర్టు పలు సందర్భాల్లో కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటి అమలులో స్థానిక అధికారుల వైఖరి ప్రశ్నార్థకంగా మారిందని కాలనీవాసులు అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నా, వాటిని అడ్డుకునే చర్యలు లేకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు నమోదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సాధారణ ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు కేవలం రికార్డులకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను అడ్డుకొని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని కోరుతున్నారు

# నిబంధనలకు విరుద్ధంగా ఓ.సి.జారీ..

## టి.ఆర్.ఎస్..పార్టీ నాయకుడు రాము యాదవ్ ఫిర్యాదు

### భారీ స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న శేరిలింగంపల్లి జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు..






**శేరిలింగంపల్లి,(ప్రజావినికిడి):**

అవినీతి, అక్రమాల్లో ప్రధాన మైన శాఖ మున్సిపల్ , రెవెన్యూ శాఖలు... మున్సిపల్ శాఖలోని టౌన్ ప్లానింగ్ విభాగం గురించి మనం అంతగా చెప్పాల్సిన అవసరం లేదు... అవినీతి , అక్రమాలు మా సొంతం అంటూ ఎన్నో ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కి.. విధుల పట్ల బాధ్యతను మరిచి అవినీతే మా అజెండా అంటూ...అక్రమాలకుపాల్పడుతున్నారు.అందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి... ఏ.సి.బి. దాడుల్లో పట్టుబడిన సంఘటనలు మనం సామాజిక మాధ్యమాల్లో..పలు దిన పత్రికలలో మనం తరచుగా చూస్తునే ఉన్నాం...ఓ నిర్మాణ దారుడు శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని సర్వే నెంబర్ 138/ఏ .. ఖాజాగూడా.. ల్యాంకో హిల్స్ రోడ్డులో నాలుగు అంతస్తులకు కమర్షియల్ భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నారు.నిర్మాణం పూర్తి చేసారు. అనంతరంఓ.సి.కి దరఖాస్తు చేసుకున్నారు.

అధికారులు పరిశీలించి ఓ.సి. జారీ చేసారు.. కానీ ఇక్కడ నిర్మాణ దారుడు సెల్లార్ నిర్మించాడు.. అధికారులకు సెల్లార్ ఏ మాత్రం కనిపించలేదా... అధికారులు ఏవరి మెప్పు కోసం..ఏ లాభం కోసం.. భవన యజమానికి అధికారుల మధ్య ఉన్న ఒప్పందం కోసమే ఓ.సి. జారీ చేసారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఈ అక్రమ ఓ.సి.. జారీ చేసి అవినీతికి పాల్పడ్డారని.. టి.ఆర్..ఎస్..( తెలంగాణ రక్షణ సేన ) పార్టీ నాయకుడు.. రాము యాదవ్.. జనవరి 28 న వ్రాత పూర్వకంగా జోనల్ కమిషనర్, కు ఫిర్యాదు చేసారు.కానీ అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తూ.. కాలయాపన చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటి..విధుల పట్ల చిత్తశుద్ధి ఎక్కడ ఉన్నది.. అధికారులు తక్షణమే స్పందించి.. నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన ఓ.సి.ని.. రద్దు చేసి తమ నిజాయితీని.. నిబద్ధతను చాటుకుంటారో ఇది కూడా మరుగున పడే అంశంగా మారిస్తే...న్యాయ పోరాటం చేస్తామని.. శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు చేసిన అవినీతి, అక్రమాలపై మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెలుగులోకి తీసుకొస్తానని కోర్టు కేసులు ఉన్న భవన నిర్మాణ అనుమతులు ఇచ్చిన ఆధారాలు అన్ని మీడియా ముఖంగా బహిర్గతం చేస్తానని అన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ముక్తా భారత్

**వాజేడు,జూన్ 2,(ప్రజావినికిడి):**



టిబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పేరూరు సర్పంచ్ గొడ్డే సరోజిని దేవి సమక్షంలో ఆర్ బి ఎస్ కె డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగినది

సొమవారం రోజున పేరూరు గ్రామంలో యంపియుపిఎస్ స్కూల్ పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.

ఈ శిబిరం నందు 62మందికి ఈ ఎక్ష రే తీయడం జరిగింది. అందులో 15 మంది టిబి,ఇతర అనుమానితులను గుర్తించడం జరిగింది అని ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ మాట్లాడుతూ, క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి.జిల్లా క్షయ నివారణ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోనీ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ క్యాంప్ లో ముఖ్యంగా డయాబెటిక్, హైపర్ టెన్షన్,జ్వరం, దగ్గు,ఇతర వ్యాధులు కలిగిన ప్రతిఒక్కరు చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ లో పాల్గొన్నారు ఆధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ టెక్నాలజీ తో 5 నిమిషాలలో ఎక్స్ రే పరీక్ష పూర్తవుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ రే టెక్నీషియన్ లకన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎచ్ఎ శ్రీను ఆశ వర్కర్స్,ఆర్ బి ఎస్ కె సిబ్బంది

# అసలైన తెల్ల గలిజేరు-శ్వేత పునర్నవ

## ప్రపంచ గందరగోళానికి శాస్త్రీయ సమాధానం -ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం

**హైదరాబాద్, (ప్రజావినికిడి):** శాస్త్రీయ పరిశోధనా విభాగం,ఔషధ మొక్కల గుర్తింపు, ప్రమాణీకరణ ఆయుర్వేద వైద్య శాస్త్రంలో దశాబ్దాలుగా ఒక పెద్ద గందరగోళం నెలకొని ఉంది. అది అసలైన తెల్ల గలిజేరు అంటే ఏది అనే ప్రశ్న.ఈ సమస్యను లోతుగా పరిశోధించి శాస్త్రీయ ఆధారాలతో నిరూపించిన ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం యొక్క అనుపమ కృషిని ఈ వ్యాసం గుర్తిస్తోంది.ఈ సంఘం చేసిన పరిశోధన ఆయుర్వేద ప్రపంచంలో ఒక కొత్త వెలుగును నింపుతోంది.

గందరగోళానికి కారణాలు – మూడు మొక్కలు, ఒకే పేరు నేటి మార్కెట్లో, పొలాలలో తెల్ల గలిజేరు పేరుతో ప్రధానంగా మూడు వేర్వేరు మొక్కలు అమ్ముడవుతున్నాయి.ఈ మూడింటిలో కేవలం ఒక్కటే నిజమైన ఔషధ మొక్క

మొదటిది అసలైన తెల్ల గలిజేరు అంటే శ్వేత పునర్నవ.దీని శాస్త్రీయ నామం బొయెర్హావియా డిఫ్యూసా లిన్ – తెల్ల పూల రకం. ఇది మాత్రమే నిజమైన ఔషధ మొక్క

రెండవది నిటారు గలిజేరు.దీని శాస్త్రీయ నామం బొయెర్హావియా ఎరెక్టా లిన్. ఇందులో పరిమిత ఔషధ గుణాలు మాత్రమే ఉంటాయి.

మూడవది ఎర్ర గలిజేరు అంటే అటక మామిడి. దీని శాస్త్రీయ నామం ట్రయాంథెమా పోర్టులాకాస్ట్రమ్ లిన్.ఇది పూర్తిగా నకిలీ మొక్క. ఇందులో విషపూరిత గుణాలు కూడా ఉంటాయి.

అసలైన తెల్ల గలిజేరును గుర్తించే విధానం

ఈ క్రింది భౌతిక లక్షణాలను పరిశీలించడం ద్వారా అసలైన శ్వేత పునర్నవను ఖచ్చితంగా గుర్తించవచ్చు.

కాండం రంగు పూర్తిగా లేత ఆకుపచ్చ లేదా తెల్లటి రంగులో ఉంటుంది.ఎక్కడా ఎరుపు లేదా గులాబీ ఛాయ ఉండదు.కాండం నేలపై పాకే స్వభావం కలిగి తీగ లాంటి నిర్మాణంతో ఉంటుంది.ఆకులు ఒక మోస్తరు గుండ్రంగా ఉండి అంచులు తరంగాల లాగా వంపు తిరిగి ఉంటాయి.ఒకే కణుపు వద్ద రెండు ఆకులు ఒకదానికొకటి ఎదురెదురుగా అమరి ఉంటాయి.

అన్నింటికంటే ముఖ్యమైన లక్షణం పూల అమరిక.చిన్న చిన్న తెల్లటి పూలు గొడుగు ఆకారపు గుత్తులుగా పొడవాటి కాడ చివరన పూస్తాయి. ఇదే అసలైన శ్వేత పునర్నవకు అతి ముఖ్యమైన గుర్తింపు లక్షణం. వేరు లావుగా ముల్లంగి లాంటి ఆకృతి కలిగి మంచి సువాసన వెదజల్లుతుంది. ఆకులు పల్చగా సున్నితంగా ఉంటాయి.

నకిలీ మొక్కతో స్పష్టమైన తేడాలు



అసలైన శ్వేత పునర్నవ కాండం మృదువుగా నేలపై పాకుతుంది.ఎర్ర గలిజేరు అటక మామిడి కాండం గట్టిగా గరుకుగా ఉంటుంది.

అసలైన మొక్క ఆకులు పల్చగా సున్నితంగా ఉంటాయి.ఎర్ర గలిజేరు అటక మామిడి ఆకులు మందంగా నీళ్ళు నిండినట్లు ఉబ్బి ఉంటాయి.

అసలైన మొక్కకు చిన్న తెల్లటి పూలు గుత్తులుగా కాడ చివరన పూస్తాయి. ఎర్ర గలిజేరు అటక మామిడికి ఒంటరి పువ్వు ఆకు కణుపు మధ్య కాడ లేకుండా అంటుకుని ఉంటుంది.

అసలైన మొక్క వేర్లలో పునర్నవిన్ అనే ఆల్కలాయిడ్ అత్యధిక మోతాదులో ఉంటుంది.ఎర్ర గలిజేరు అటక మామిడిలో పునర్నవిన్ అసలు ఉండదు.

అసలైన మొక్క మూత్రపిండాలు కాలేయం అలాగే గుండెకు అమృతం లాంటిది. ఎర్ర గలిజేరు అటక మామిడి కేవలం విరేచన కారిగా మాత్రమే పనిచేస్తుంది.

ఆయుర్వేద ఔషధ గుణాలు

ఆయుర్వేద గ్రంథాలైన భావప్రకాశం మరియు చరక సంహితలో శ్వేత పునర్నవను మహాశోథహర అని కొనియాడారు. అంటే శరీరంలో ఎలాంటి వాపులనైనా మూత్రపిండ జబ్బులనైనా నయం చేయగల అత్యుత్తమ మూలిక అని అర్థం.ఈ మొక్క వేర్లలో పునర్నవిన్ అనే ఆల్కలాయిడ్ మూత్రపిండాల పునరుజ్జీవనానికి అత్యంత ఉపయోగపడుతుంది. మూత్రపిండాల వ్యాధుల నివారణకు కాలేయ రక్షణకు శరీర వాపుల తగ్గింపుకు,గుండె రక్షణకు ఇది అమోఘంగా పనిచేస్తుంది.వాత పిత్త కఫ అనే మూడు దోషాలనూ సమతుల్యం చేసే శక్తి ఈ మొక్కలో ఉంది.

నకిలీ మొక్కలు వాడటం వల్ల జరిగే నష్టాలు

మార్కెట్లో లభించే నకిలీ మొక్కలను అసలైన తెల్ల గలిజేరు అనుకుని వాడటం వల్ల మూత్రపిండ సమస్యలు తగ్గకపోగా రోగం మరింత ముదురుతుంది. అమూల్యమైన సమయం వృధా అవుతుంది.కొన్ని నకిలీ మొక్కలలో విషపూరిత గుణాలు ఉండవచ్చు దాని వల్ల కాలేయంపై అదనపు భారం పడుతుంది. దీర్ఘకాలంలో ప్రాణాలకే ముప్పు కలిగే పరిస్థితులు వస్తాయి. అంతకంటే మించి ఆయుర్వేదానికి అపకీర్తి కలుగుతుంది. ఈ మహా శాస్త్రంపై సమాజంలో నమ్మకం సన్నగిల్లుతుంది.

సమాజానికి సందేశం

ఏ ఔషధ మొక్కనైనా వాడే ముందు తప్పకుండా ఔషధ మొక్కల నైపుణ్యం మరియు విజ్ఞానం కలిగిన అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులను సంప్రదించండి. సరైన మొక్కలు సరైన మోతాదులో వాడినప్పుడే ఆయుర్వేదం నిజమైన ఫలితాలు ఇస్తుంది.అలా కాకుండా అజ్ఞానంతో నకిలీ మొక్కలు వాడడం వల్ల ఆయుర్వేదానికే చెడ్డపేరు వస్తుంది. ఇది మన అందరి బాధ్యత.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండండి. ఔషధ మొక్కల విజ్ఞానం లేకుండా నైపుణ్యం కలిగిన వైద్యులను సంప్రదించకుండా ఏ మూలికనూ వాడకండి. ఆయుర్వేదం అనాదిగా మన జీవితాలను కాపాడిన మహా శాస్త్రం. దాన్ని కాపాడే బాధ్యత మనందరిది.

శాస్త్రీయ నిరూపణ పద్ధతులు

ఈ పరిశోధన సంఘం రూపశాస్త్ర పరీక్ష అంటే కాండం ఆకు పూల భౌతిక లక్షణాల పరిశీలన ద్వారా మొక్కను నిర్ధారించింది. పాతల పొర వర్ణలేఖన పరీక్ష ద్వారా వేర్లలో పునర్నవిన్ స్థాయులను నిర్ధారించింది. జీవ సంకేత పరీక్ష ద్వారా జాతిని ఖచ్చితంగా నిర్ధారించింది. పుష్పవిన్యాస అధ్యయనం ద్వారా పూల కాడల అమరిక ఆధారంగా ఎర్ర గలిజేరు అటక మామిడి నుండి తేడాను నిరూపించింది.



**అసలైన తెల్ల గలిజేరును నిరూపించిన ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి ఫోన్: +91 99082 89830**

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోలీసులకు పతకాలు

### విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్‌కు సర్వోన్నత పోలీసు పతకం

### భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు శౌర్య పతకాలు

### 16 మందికి మహోన్నత సేవా పతకాలు

**హైదరాబాద్, (ప్రజావినికిడి):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఉత్తమ సేవలు అందించిన 632 మంది పోలీసులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. ఈ మేరకు ఈరోజు వారి పేర్లను ప్రకటించింది. విశిష్ఠ, అత్యుత్తమ మరియు ఉత్తమ సేవలకు గుర్తింపుగా, పోలీస్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక బ్యూరో, ప్రత్యేక రక్షణ దళం, అగ్నిమాపక సేవల విభాగాలకు చెందిన సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేశారు.తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్ ప్రతాప్‌కు సీఎం సర్వోన్నత పోలీసు పతకం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు తెలంగాణ పోలీస్ శౌర్య పతకాలను ప్రకటించారు. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సంపత్, గ్రేహౌండ్స్‌లోని మరో ఏడుగురిని శౌర్య పతకాలు వరించాయి. 16 మందికి మహోన్నత సేవా పతకాలు, 94 మందికి ఉత్తమ సేవా పతకాలు, 50 మంది కఠిన సేవా పతకాలు, మరో 461 మంది సేవా పతకాలు అందుకోనున్నారు.



# తెలంగాణ మేధావులు ఆలోచించాలి !

**జూన్ 1(ప్రజావినికిడి):**




తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్‌ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

## ఆమెరికా దళాల దాడులతో మొదటికొచ్చిన వ్యవహారం

**వాషింగ్టన్, జూన్ 1(ప్రజావినికిడి):**



శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి. హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్ క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఘద్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

# కొనసాగుతున్న ఎండల తీవ్రత

## పలు జిల్లాల్లో గతేడాది కన్నా మిన్నగా ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, జూన్ 1(ప్రజావినికిడి):**




రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. రుతపవనాలు జాడ ఇంకాలేదు. ఈ క్రమంలో అనేక జిల్లాల్లో ఎండల తీవ్రత పెరిగింది. నిరుటితో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి ప్రతాపంతో నిప్పుల కుంపటిగా ఉన్న రాష్ట్రం ఒక్కసారిగా వాతావరణం సాయంత్రం మారింది. ఆదిలాబాద్ జిల్లా రైతులు మార్కెట్ యార్డులో పోసిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పదిరోజుల్లో ప్రవేశించనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రుతుపవనాలు జూన్ 10 నుంచి 12 తేదీల మధ్య రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నది. వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాలు రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్టు వెల్లడించింది. వచ్చే నాలుగు రోజులు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని స్పష్టం చేశారు.

# ముమ్ముందు వర్షాభావ పరిస్థితులు

## నీటిని పొదుపుగా వాడుకోవాలన్న మంత్రి


**రాజమహేంద్రవరం,జూన్ 1(ప్రజావినికిడి):**



వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముందుగానే నాట్లు వేసుకొని పంటలను రక్షించుకోవాలని రైతులకు మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు. ముందస్తు నీటి విడుదలతో త్వరగా పంట చేతికి వస్తోందని, దీంతో నష్టాల బారి నుంచి రైతు గట్టెక్కవచ్చాన్నారు. నీటిని పొదుపుగా వాడుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి ఖరీఫ్ సీజన్ సాగునీటిని విడుదల చేసినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతులకు మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఇదిలావుంటే దుక్కి దున్నడం నుంచి పంట విక్రయం వరకు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చుతున్న అన్నదాతలకు ఆదాయం అంతంతమాత్రంగానే వస్తోంది. సాగులో తెగుళ్లు, వడగళ్ల వానలు నష్టం మిగల్చగా వరి కోతలతో రైతులకు ఆర్థిక మోత పడుతోంది. ధాన్యాన్ని కల్లాల కు, కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు, ఇళ్లలోకి తరలించడానికి రవాణా ఛార్జీలు సైతం తడిసి మోపెడవుతున్నాయి. ఇంధనం ధరల హెచ్చు తగ్గులను సాకుగా చూపుతూ యంత్రాలు, ట్రాక్టర్ల యజమానులు అద్దె ధరలను పెంచేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీలో ఎకరానికి పెట్టుబడిగా రూ.40 నుంచి రూ.45 వేలు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

# భారత్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు.. ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపు

**రాజమహేంద్రవరం, జూన్ 1(ప్రజావినికిడి):**




సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలు, ఇతర జాతీయ పరీక్షల వివాదాలు దేశంలో చర్చనీయాంశంగా మారిన వేళ సరికొత్తగా ఆవిర్భవించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన ప్రకటన చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసనలు చేపట్టడానికి తాను జూన్ 6న భారతదేశానికి తిరిగి వస్తున్నట్లు ప్రకటించారు. **ఎయిర్‌పోర్ట్ నుంచే నిరసనలు:**ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను విడుదల చేసిన అభిజీత్ దీప్కే.. జూన్ 6 శనివారం ఉదయం తాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగుతున్నట్లు వెల్లడించారు. పరీక్షల లోపాల వల్ల తీవ్ర ఆందోళనలో ఉన్న విద్యార్థులు, తమ పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. “మనం అంతా కలిసి భారత రాజ్యాంగబద్ధంగా, శాంతియుతంగా మన గొంతు వినిపించాల్సిన సమయం వచ్చింది. మేమంతా ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనలు చేపట్టడానికి అనుమతి కోరతాం” అని దీప్కే వెల్లడించారు.

# కొత్త క్రికెటర్ల ప్రతిభను వెలికితెచ్చిన ఐపిఎల్

**న్యూఢిల్లీ, జూన్ 1(ప్రజావినికిడి):**



దాదాపు రెండునెలల పాటు సాగిన ఐపిఎల్ 2026 సంబరం ముగిసింది. ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా యువ క్రికెటర్లు ఎంతోమంది తమ సత్తా చాటారు. వైభవ్ సూర్యవంశీ లాంటి వారు భవిష్యత్ ఇంటియా టీమ్‌కు తురుపుముక్కలా కనిపించినట్లే. దాదాపు రెండున్నర నెలల పాటు అభిమానులు సమ్మర్ ఎంజయ్ చేశారు. ఆదివారం సాయంత్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ ఫైల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. వరుసగా రెండో సారి ఐపీఎల్ ట్రోఫీ సాధించింది. గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో గుజరాత్ టైటాన్స్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించిన ఆర్సీబీ వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐపీఎల్ 2026 ఫైల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విరాట్ కోహ్లి 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటీదార్ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. దాంతోపాటు ట్రోఫీని ఈసారి కూడా అభిమానులకే అంకితం చేస్తున్నట్లు వెల్లడించాడు.'కోహ్లి గురించి చెప్పడానికి నాకు మాటలు రావడం లేదు. కెరీర్‌లో అతడు సాధించలేనిది అంటూ ఏమీ లేదు. విరాట్ ఎంత గొప్ప ఆటగాడో కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. మైదానంలోనే కాదు.. బయట కూడా అతడి నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. జట్టులోని ప్రతి ఆటగాడితో మాట్లాడుతుంటాడు. క్రికెట్‌కు సంబంధించిన విషయాలే కాకుండా జీవితానికి ఉపయోగపడే అంశాలపై కూడా సూచనలు ఇస్తుంటాడు. నేను ఎప్పుడూ విరాట్‌ను గమనిస్తూ ఉంటాను. నెట్స్‌లో అతడు చూపించే ఉత్సాహం, మ్యాచ్‌లో కనిపించే ఎనర్జీ ఒకేలా ఉంటాయి. అదే కోహ్లి ప్రత్యేకత' అని పాటీదార్ వెల్లడించాడు. ఈ సీజన్‌లో విరాట్ 675 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరుసగా రెండో కప్పును సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. ఫైనల్ కోసం ఇక్కడికి వచ్చాక గతేడాది జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఎలా ఆడామో.. ఇప్పుడు కూడా అదే దూకుడును ప్రదర్శించాం. జట్టులోని ప్రతి బౌలర్‌ను నేను మెన్షన్ చేయాలి. కెప్టెన్‌గా ఇక్కడ నా ప్రయాణం అద్భుతం. గతేడాది మాపై తీవ్ర ఒత్తిడి ఉండేది. కానీ ఈసారి అంచనాలు ఉన్నప్పటికీ ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడాం. తొలి మ్యాచ్ నుంచే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాం. మేం ఎక్కడికి వెళ్లినా అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ప్రోత్సహించారు. వారి కోసం ఏం చేసినా తక్కువే. ఈ సలానూ కప్ నమ్‌దు.. ఈ సారి కూడా ట్రోఫీని అభిమానులకే అంకితం చేస్తున్నా' అని పాటీదార్ వెల్లడించాడు. ఇదిలావుంటే వరుసగా రెండో టైటిల్ సాధించిన ఆర్సీబీ జట్టుకు, ఆటగాళ్లకు, కోచింగ్ సిబ్బందికి కర్నాటక కాబోయే సిఎం శివకుమార్ అభినందనలు తెలిపారు. జట్టు అద్భుత ప్రదర్శనతో మరోసారి ఛాంపియన్‌గా నిలవడం కర్ణాటక ప్రజలకు గర్వకారణమని ప్రశంసించారు. విరాట్ కోహ్లి వేగవంతమైన అర్ధశతకంతో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును గెలిపించాడు. అయితే ఐపీఎల్ ఫైనల్ వేదికపై కర్ణాటక కాబోయే శివకుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఆర్సీబీ ఫ్యాన్స్‌కు అన్యాయం జరిగిందని అన్నారు. ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో జరగాల్సింది. కొన్ని కారణాల వల్ల మ్యాచ్‌ను మరో వేదికలో నిర్వహించారు. ఆర్సీబీ అభిమానులకు అన్యాయం జరిగింది. దీనిపై ఎక్కువగా మాట్లాడదలచుకోలేదు' అని శివకుమార్ పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ట్రోఫీని అభిమానులకు అంకితం




## - ఆర్సీబీ కెప్టెన్ పటీదార్ కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి ఆర్సీబీ వరుసగా రెండో టైటిల్ సాధించింది. అయితే మ్యాచ్ తర్వాత ఆర్సీబీ కెప్టెన్ పటీదార్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్ గెలవడం మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉందని అన్నాడు. అలాగే తాము ఎక్కడికి వెళ్లినా అండగా నిలిచిన అభిమానులకు ఈ ట్రోఫీని వారికే అంకితం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించాడు. ఈ సాలా కప్ నమ్దు అని నినాదం చేశాడు. ఐపీఎల్ 2026లో విజేతగా నిలిచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు రెండో ఐపీఎల్ టైటిల్ దక్కించుకుంది. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్‌లో గెలిచి ఈ ఫీట్ సాధించింది. రజత్ పటీదార్ సారథ్యంలోనే ఆర్సీబీ ఈ టైటిల్స్ సాధించడం గమనార్హం. గతంలో విరాట్ కోహ్లీ, డేనియల్ విటోరీ, అనిల్ కుంబ్లే, ఫాఫ్ డుప్లెసిస్, రాహుల్ ద్రావిడ్ లాంటి స్టార్‌లకు సైతం సాధ్యం కాని టైటిల్‌ను పటీదార్ అందించాడు. ఇక ఐపీఎల్ 2026 ఫైనల్ తర్వాత మాట్లాడిన ఆర్సీబీ కెప్టెన్ కీలక కామెంట్స్ చేశాడు. ఈ సీజన్‌లో తమ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు."వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్‌ను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉంది. ఫైనల్ కోసం ఇక్కడికి (అహ్మదాబాద్) వచ్చాక గతేడాది జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఎలా ఆడామో.. ఇప్పుడు కూడా అదే దూకుడు ప్రదర్శించాం. ఈ విజయంపై ఏం మాట్లాడాలో కూడా నాకు అర్థం కావడం లేదు. టాస్ గెలిస్తే ఏం చేయాలనే దానిపై ముందు నుంచి క్లారిటీతో ఉన్నాం. మా ప్లాన్ ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నాం. ఇక్కడ ఛేజింగ్ ఈజీగా ఉంటుందని భావించి, టాస్ నెగ్గాక బౌలింగ్ ఎంచుకున్నాం" అని పటీదార్ అన్నాడు. "ఈ సీజన్‌లో మా బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఫైనల్‌లోనూ గుజరాత్ టైటాన్స్‌లో టాప్-3 బ్యాటర్లను ఔట్ చేస్తే.. మేం మ్యాచ్‌లో పట్టుసాధించొచ్చని భావించాం. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, రసిక్ సలామ్ దార్.. అదే చేసి చూపించారు. ఈ ముగ్గురు ఈ సీజన్‌లో చాలా ప్రభావం చూపించారు. వారే కాదు మా జట్టులోని ప్రతి ఒక్కరు చక్కగా రాణించారు. రెండోసారి టైటిల్ అందుకోవడం బాగుంది. నిజానికి గతేడాది మాపై తీవ్ర ఒత్తిడి ఉండేది. కానీ, ఈసారి అలాంటి పరిస్థితి లేదు. అంచనాలు ఉన్నాయి, కానీ ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడాం" అని ఆర్సీబీ కెప్టెన్ వ్యాఖ్యానించాడు. "మేం ఎక్కడికి వెళ్లినా మా అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ప్రోత్సహించారు. వారి కోసం మేం ఏం చేసినా తక్కువే. ఈ సాలా కప్ నమ్దు. గతేడాది మాదిరిగానే ఈసారి కప్పును కూడా వారికే అంకితం చేస్తున్నాం" అని రజత్ పటీదార్ చెప్పుకొచ్చాడు. కాగా పటీదార్ ఈ సీజన్‌లో కెప్టెన్‌గానే కాకుండా ఆటగాడిగా కూడా అదరగొట్టాడు. కీలక సమయాల్లో రాణించాడు. 14 ఇన్నింగ్స్‌లలో 501 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

# అవార్డులన్నీ వైభవ్ సూర్యవంశీకే..

అవార్డులన్నీ వైభవ్ సూర్యవంశీకే.. యూనివర్శల్ బేబీ బాస్‌గా పేరొందిన వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026లో పెను విధ్వంసం సృష్టించాడు. 2025లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ 35 బంతుల్లోనే సెంచరీ బాది ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసి ఇండియన్‌గా నిలిచాడు. ఈ ఏడాది కూడా సిక్సర్ల మోత మోగించి రికార్డులన్నీ బద్దలుకొట్టాడు. ఇప్పుడు ఏకంగా ఐపీఎల్ 2026 బ్యాటింగ్ అవార్డులన్నీ సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ 16 మ్యాచ్‌లు ఆడి 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఒక సెంచరీతో పాటు ప్లే ఆఫ్స్‌లో 97, 96 పరుగులతో అద్భుతంగా రాణించాడు. క్వాలిఫయర్ 2లో గుజరాత్‌పై ఆడిన ఇన్నింగ్స్‌కి లెజెండ్రీ క్రికెటర్లంతా ఫిదా అయ్యారు. 15 ఏళ్ల వయస్సులోనే ఇంత బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఎలా ఆడాడంటూ ఆశ్చర్యపోయారు. 63 ఫోర్లతో పాటు 72 సిక్సర్లు బాది క్రిస్ గేల్ రికార్డును ఊదేశాడు. ఐపీఎల్ 2026 మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌తో పాటు అన్ని బ్యాటింగ్ అవార్డులన్నీ వైభవ్‌కే దక్కాయి. ఒక్క మోస్ట్ ఫోర్స్ మినహా మిగతా అన్నీ కూడా వైభవ్ ఖాతాలోనే చేరాయి. అత్యధిక ఫోర్ల లిస్ట్‌లో మాత్రం గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ ఫస్ట్ ప్లేస్‌లో నిల్చొని అవార్డు




అందుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ సొంతం చేసుకున్న అవార్డుల జాబితా ఇదే. 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. భవిష్యత్తులో కూడా ఎవ్వరూ సాహసించలేని విధంగా 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. అదేవిధంగా చివరిదైన ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో ఒక్క ఫోర్స్ మినహా మిగతా అన్నీ వైభవ్ సూర్యవంశీనే సొంతం చేసుకున్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో పర్పుల్ క్యాప్‌ను 29 వికెట్లతో కగిసో రబడా సొంతం చేసుకున్నాడు. ఎక్కువ డాట్ బాల్స్ వేసిన బౌలర్‌గా మొహమ్మద్ సిరాజ్ (172) నిలిచాడు. ఫెయిర్ ప్లే అవార్డును పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకుంది. క్యాచ్ ఆఫ్ ది సీజన్ అవార్డును కోల్‌కతా నైట్ రైడర్స్ ప్లేయర్ మనీష్ పాండే సొంతం చేసుకున్నాడు.




# జూన్ 6 నుంచే నాన్‌స్టాప్ క్రికెట్ ధమాకా..

క్రికెట్ ప్రేమికులను రెండు నెలల పాటు ఉర్రూతలూగించిన ఐపీఎల్ 2026 సీజన్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ లీగ్‌లో కింగ్ విరాట్ కోహ్లీ అజేయంగా 75 పరుగులు చేసి ఆర్‌సీబీని గెలిపించి తన సత్తా చాటాడు. అయితే ఐపీఎల్ వినోదం ముగియడంతో ఇక ఫ్యాన్స్ అందరి కళ్ళు అంతర్జాతీయ క్రికెట్‌పై పడ్డాయి. గత మార్చి నెలలో టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత టీమ్ ఇండియా ఆటగాళ్లు ఐపీఎల్‌లో బిజీగా ఉండటం వల్ల ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. కానీ ఇప్పుడు ఐపీఎల్ ముగియడంతో వారం తిరక్కుండానే జూన్ 6 నుంచి భారత జట్టు మళ్లీ రంగంలోకి దిగుతోంది. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఏమాత్రం గ్యాప్ లేకుండా శుభ్‌మన్ గిల్ వంటి స్టార్ ప్లేయర్లతో కూడిన టీమిండియా జూన్ 6 నుంచి మైదానంలోకి అడుగుపెట్టబోతోంది. దీనికి న్యూ చండీగఢ్ వేదిక కానుంది. జూన్ 6 నుంచి జూన్ 10 వరకు భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఒకే ఒక్క చారిత్రాత్మక టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఈ టెస్ట్ మ్యాచ్ ముగిసిన వెంటనే జూన్ 13 నుంచి జూన్ 20 వరకు ఈ రెండు జట్ల మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగబోతోంది. ఈ సిరీస్‌తో భారత్ లాంగ్ ఇంటర్నేషనల్ సీజన్‌కు శ్రీకారం చుట్టనుంది. అఫ్గానిస్తాన్ సిరీస్ పూర్తి కాగానే టీమ్ ఇండియా విదేశీ పర్యటనలకు బయలుదేరుతుంది. జూన్ 26 నుంచి జూన్ 29 వరకు ఐర్లాండ్ పర్యటనలో భాగంగా భారత్ 2 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఆ వెంటనే జూలై నెలలో ఇంగ్లాండ్‌తో భారీ సిరీస్ షెడ్యూల్ అయింది. జూలై 1 నుంచి జూలై 11 వరకు ఇంగ్లాండ్ గడ్డపై 5 మ్యాచ్‌ల భారీ టీ20 సిరీస్, ఆ తర్వాత జూలై 14 నుంచి జూలై 19 వరకు 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనున్నాయి. ఈ ఇంగ్లాండ్ పర్యటన భారత జట్టుకు అత్యంత ప్రతిష్టాత్మకం కానుంది. ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే జూలై 23 నుంచి జూలై 26 వరకు జింబాబ్వే దేశంలో భారత్ 3 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఇక ఆగస్టు నెలలో టీమిండియా పొరుగు దేశమైన శ్రీలంకలో పర్యటించాల్సి ఉంది. లంకతో భారత్ 2 టెస్ట్ మ్యాచ్‌లు, అలాగే 3 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. అయితే ఈ శ్రీలంక పర్యటనకు సంబంధించిన ఖచ్చితమైన తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.



# రూ. 2.85 కోట్లు సంపాదించాడు

ఈ ఏడాది ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ ఎన్నో రికార్డులు బద్దలుకొట్టాడు. దాంతో సీజన్ ముగింపు రోజున చాలా అవార్డులు సొంతం చేసుకున్నాడు. ప్రతీ అవార్డుకు కూడా ప్రైజ్‌మనీ ఉంటుంది. ఐపీఎల్ కాంట్రాక్ట్, ఐపీఎల్ మ్యాచ్ ఫీజు, సీజన్ అవార్డులు అన్నీ కలుపుకొని వైభవ్ సూర్యవంశీ రూ. 2.85 కోట్లు సంపాదించాడు. వీటికి అదనంగా ప్రతీ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ఎలక్ట్రిక్ స్ట్రయికర్ ఆఫ్ ది మ్యాచ్, మోస్ట్ సిక్సెస్ ఆఫ్ ది మ్యాచ్ ఇవన్నీ మళ్లీ అదనమే.ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున 2025లో ఎంట్రీ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ కేవలం ఒక్క సీజన్‌తోనే యూనివర్శల్ బాస్ బేబీగా పేరు తెచ్చుకున్నాడు. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే ఐపీఎల్ రికార్డులన్నీ బద్దలు కొట్టేశాడు. క్రిస్ గేల్ ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన అత్యధిక సిక్సర్ల రికార్డును కూడా కొల్లగొట్టేశాడు. ఈ సీజన్‌లో కేవలం రికార్డులే కాదు రివార్డులు కూడా వైభవ్ సంపాదించాడు. ఐపీఎల్ 2026లో అత్యధిక అవార్డులు అందుకుని రివార్డులు తీసుకున్న ప్లేయర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. ఆరెంజ్ క్యాప్‌తో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు, సూపర్ స్ట్రయికర్, సూపర్ సిక్సెస్ ఇలా బ్యాటింగ్ తరఫున అన్ని అవార్డులూ వైభవ్ సూర్యవంశీకే దక్కాయి. ఒక్క మోస్ట్ ఫోర్స్ అవార్డు మాత్రం సాయి సుదర్శన్ సొంతం చేసుకున్నాడు. ఈ అవార్డులు అన్నిటికీ వైభవ్ సూర్యవంశీకి డబ్బులు వచ్చాయి. ఐపీఎల్ మెగా వేలంలో వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ రూ. 1.1 కోటి ధరకు సొంతం చేసుకుంది. ఐపీఎల్‌లో వైభవ్ ఫస్ట్ కాంట్రాక్ట్ కూడా ఇదే. ఈ డబ్బుతో పాటు ప్రతీ మ్యాచ్ ఆడినందుకు కూడా ఫీజు ఉంటుంది. ఒక్కో మ్యాచ్‌కు రూ. 7.5 లక్షల చొప్పున ఈ సీజన్‌లో మొత్తం 16 మ్యాచ్‌లు ఆడాడు.

# గుజరాత్ టైటాన్స్ జట్టుకు త్రుటిలో తప్పిన ప్రమాదం..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన గుజరాత్ టైటాన్స్ జట్టుకు కొద్దిసేపటికే ఒక ఊహించని ప్రమాదం ఎదురైంది. ఆదివారం రాత్రి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం నుంచి మ్యాచ్ ముగించుకుని ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ హోటల్‌కు తిరిగి వెళ్తుండగా వారి టీమ్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బస్సులో షార్ట్ సర్క్యూట్ సంభవించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే, అప్రమత్తమైన సిబ్బంది ఆటగాళ్లందరినీ వెంటనే సురక్షితంగా కిందకు దించేయడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో షార్ట్ సర్క్యూట్ అవ్వడం వల్ల క్షణాల వ్యవధిలోనే లోపల దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది వాహనం నుండి కిందకు దిగి ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రత్యామ్నాయ బస్సు అందుబాటులో లేకపోవడంతో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు దాదాపు గంటపాటు రోడ్డుపైనే వేచి చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్రాంఛైజీ యాజమాన్యం వేరే బస్సును ఏర్పాటు చేయడంతో అందరూ సురక్షితంగా హోటల్‌కు చేరుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, అందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు ధృవీకరించారు. ఐపీఎల్ 2026 ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో గుజరాత్ టైటాన్స్ 5 వికెట్ల తేడాతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ కేవలం 155/8 పరుగులకే పరిమితమవగా.. ఆర్సీబీ ఆ లక్ష్యాన్ని ఛేదించి వరుసగా రెండో ఏడాది కూడా ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మైదానంలో ఓటమి బాధతో ఉన్న టైటాన్స్ జట్టుకు, ఈ బస్సు ప్రమాదం మరింత ఆందోళన కలిగించింది. గత కొద్దిరోజులుగా గుజరాత్ టైటాన్స్ జట్టుకు ప్రయాణ షెడ్యూల్ చాలా భారంగా మారింది. మే 26న ధర్మశాలలో ఆర్సీబీతో క్వాలిఫైయర్-1 ఆడిన జట్టు, ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్‌తో క్వాలిఫైయర్-2 ఆడేందుకు మే 27న ముల్లాన్‌పూర్‌కు ప్రయాణమైంది. అక్కడ మే 29న మ్యాచ్ ముగిశాక, మే 30న అహ్మదాబాద్ బయలుదేరాల్సి ఉండగా.. ప్రతికూల వాతావరణం వల్ల వారి చార్టర్డ్ ఫ్లైట్ దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. దీనివల్ల శనివారం అర్ధరాత్రి మాత్రమే వారు అహ్మదాబాద్ చేరుకోగలిగారు. ఈ విపరీతమైన అలసట వల్లే ఫైనల్‌లో జట్టు ఘోరంగా విఫలమైందా? అని మ్యాచ్ అనంతరం విలేకరులు ప్రశ్నించగా.. గుజరాత్ టైటాన్స్ క్రికెట్ డైరెక్టర్ విక్రమ్ సోలంకి ఆ నెపాన్ని షెడ్యూల్‌పైకి నెట్టడానికి నిరాకరించారు. "ఆర్సీబీ చాలా బాగా ఆడి గెలిచింది. వరుస మ్యాచ్‌ల వల్ల మేము అలసిపోయామని చెప్పి వారి గెలుపు క్రెడిట్‌ను తగ్గించలేము. మా స్కోరు తక్కువైనప్పటికీ మా బౌలర్లు పోరాడారు" అని సోలంకి వ్యాఖ్యానించారు.

# కెనడా క్రికెట్ బోర్డుపై సస్పెన్షన్ వేటు

ఐసీసీ తాజాగా ఒక ఊహించని నిర్ణయం తీసుకుని క్రీడా ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటివరకు పలు ప్రపంచకప్ టోర్నమెంట్లలో పాల్గొన్న కెనడా క్రికెట్ బోర్డు పై ఐసీసీ తక్షణమే అమలులోకి వచ్చేలా సస్పెన్షన్ వేటు వేసింది. ఐసీసీ సభ్యత్వ నిబంధనలను, బాధ్యతలను కెనడా క్రికెట్ బోర్డు తీవ్రంగా ఉల్లంఘించిందనే ఆరోపణల నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. మే 31న అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ కీలక తీర్పు వెలువడింది. కెనడా క్రికెట్ బోర్డును సస్పెండ్ చేస్తున్నట్లు ఐసీసీ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే ఈ నిషేధం కేవలం అడ్మినిస్ట్రేషన్ కు మాత్రమే పరిమితం కానుంది. దీనివల్ల కెనడా దేశానికి చెందిన క్రికెట్ ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగదు. వారు ఎప్పటిలాగే ఐసీసీ నిర్వహించే అన్ని అంతర్జాతీయ టోర్నమెంట్లలో సాధారణంగానే పాల్గొనవచ్చని ఐసీసీ భరోసా ఇచ్చింది. ఆటగాళ్ల భవిష్యత్తు, వారి ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండటం కోసం ఐసీసీ ఒక ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ద్వారా నిధులను నేరుగా అందజేయనుంది. కెనడా క్రికెట్ బోర్డుపై విధించిన ఈ నిషేధాన్ని ఎత్తివేయడానికి ఐసీసీ కొన్ని కఠినమైన షరతులను విధించింది. బోర్డులోని పరిపాలనా లోపాలను, ఆర్థిక అవకతవకలను పూర్తిగా సరిదిద్దడమే ఈ షరతుల ముఖ్య ఉద్దేశం. కెనడా బోర్డు ఈ దిశగా పనులు చేస్తోందా లేదా అని నిరంతరం గమనించడానికి, పర్యవేక్షించడానికి ఐసీసీ ఒక ప్రత్యేక కమిటీని




కూడా ఏర్పాటు చేయబోతోంది. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే భవిష్యత్తులో కెనడా బోర్డు పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఐసీసీ మీటింగ్‌లో కెనడా నిషేధంతో పాటు మరికొన్ని చారిత్రాత్మక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. సాధారణంగా టెస్ట్ మ్యాచ్‌లలో వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు ఆటను ముందే ముగించేస్తుంటారు, ఇది ఫ్యాన్స్‌కు తీవ్ర నిరాశ కలిగిస్తుంది. దీనిని నివారించడం కోసం.. మ్యాచ్ సమయంలో వెలుతురు తగ్గినప్పుడు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరిస్తే గనుక, ఎరుపు రంగు బంతికి బదులుగా పింక్ బాల్ ఉపయోగించవచ్చనే సరికొత్త ప్రతిపాదనకు ఐసీసీ ఆమోదం తెలిపింది. దీనివల్ల రాబోయే రోజుల్లో సాధారణ టెస్ట్ మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్ మ్యాజిక్ కనిపించనుంది. ఈ కీలక సమావేశంలో పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించిన క్వాలిఫైయింగ్ ప్రక్రియపై కూడా చర్చలు జరిగాయి. రాబోయే ప్రపంచకప్ టోర్నీల కోసం ఒక భారీ గ్లోబల్ క్వాలిఫైయర్ టోర్నమెంట్‌ను నిర్వహించే విషయంపై ఐసీసీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. దీనివల్ల అసోసియేట్ దేశాలకు ప్రపంచకప్‌కు అర్హత సాధించేందుకు మరింత సమానమైన అవకాశాలు లభిస్తాయి.

# అరసన్‌లో ప్రియాంక అరుల్ మోహన్



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది ’ఓజీ’తో అలరించిన ఈమె.. ఈ ఏడాది ’మేడ్ ఇన్ కొరియా’తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ’అరసన్’. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ’666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్’తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.

------------

# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

### నగరంలోని విమల్ థియేటర్ వద్ద కొంత షూట్ కోసం యత్నాలు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ’స్పిరిట్’ ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు ’స్పిరిట్’ షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ’స్పిరిట్’ చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. ’యానిమల్’ తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పుకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

# పెద్ద మనసు చాటుకున్న హీరో సూర్య..

## ‘కరుప్పు‘ టీమ్‌కు ఖరీదైన కార్లు బహుమతి

తన సినిమా విజయంలో భాగమైన సాంకేతిక నిపుణులపై బహుమతుల వర్షం కురిపించడంలో హీరో సూర్య ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తన బ్లాక్‌బస్టర్ చిత్రం ‘కరుప్పు‘ సాధించిన భారీ విజయం సందర్భంగా చిత్ర బృందంలోని కీలక సభ్యులకు ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చి మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఈ ఏడాది తమిళంలో అతిపెద్ద హిట్‌లలో ఒకటిగా నిలిచింది.

ఈ విజయానికి కృతజ్ఞతగా, సినిమాటోగ్రాఫర్ జి.కె. విష్ణుకు సూర్య ఖరీదైన మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ ఎలక్ట్రిక్ కారును బహుమతిగా అందించారు. సుమారు రూ. 30-40 లక్షల విలువైన ఈ ప్రత్యేకమైన కారును అందుకున్న విష్ణు, తన ఆనందాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. కారుతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తూ.. “ఇది దేవుడి ఆశీర్వాదం! థ్యాంక్యూ సూర్య సర్. మీది చాలా పెద్ద మనసు!!!“ అని రాసుకొచ్చారు. సినిమా అద్భుతమైన విజువల్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేయడంలో విష్ణు



పనితనం కీలక పాత్ర పోషించింది.

సూర్య తన ప్రశంసలను కేవలం సినిమాటోగ్రాఫర్‌కే పరిమితం చేయలేదు. ‘కరుప్పు‘ సినిమాకు అద్భుతమైన నేపథ్య సంగీతం, చార్ట్‌బస్టర్ పాటలు అందించిన సంగీత దర్శకుడు సాయి అభ్యంక్కర్‌కు కూడా ఇదే మోడల్ కారును బహుమతిగా ఇచ్చారు. వీరితో పాటు ఎడిటర్ ఆర్ కలైవానన్‌కు కూడా సూర్య కారు బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. మే 15న విడుదలైన ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా, తన కథనంతో పాటు సాంకేతిక విలువలతోనూ విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

విజయాన్ని తన సహచరులతో పంచుకునే సూర్య మంచి మనసు గురించి చిత్ర పరిశ్రమలో అందరికీ తెలిసిందే. గతంలో కూడా ఆయన పలుమార్లు తన చిత్ర బృందానికి ఇలాంటి విలువైన బహుమతులు అందించారు. సూర్య ఔదార్యంపై అభిమానులు, సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నటుడు ఆర్జే బాలాజీ వంటి వారు సూర్య పెద్ద మనసును కొనియాడారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా సూర్య గొప్ప నాయకత్వ లక్షణాలను ప్రదర్శిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు అభినందిస్తున్నాయి.

# వ్యక్తిత్వ హననం చేసే ట్రోల్ చేస్తున్న వారిపై మాధురి మండిపాటు

సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రీ, ధర్ణ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం ’మా బెహెన్’. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు.ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే‘ అన్నారు. త్రిప్తి మాట్లాడుతూ.. ‘ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది.



# ప్రేక్షకులు దేవుళ్లు..

## సినిమా ఓ సేవ: జాన్వీ కపూర్



సినిమా చూసే ప్రేక్షకులు దేవుళ్లతో సమానమని త్వరలో విడుదల కానున్న ‘పెద్ది’ సినిమా హీరోయిన్ జాన్వీ కపూర్ అభిప్రాయపడింది. సినిమా తీయడం వారికి చేసే ఓ గొప్ప సేవ అని వ్యాఖ్యానించింది. వారి అభిప్రాయాలే నటీనటులను మరింత రాటుదేలేలా చేస్తాయని తెలిపింది. ప్రేక్షకులను అలరించడానికే తాము నిరంతరం శ్రమిస్తామని జాన్వీ పేర్కొంది. సోషల్ మీడియాలో కొందరు సినిమా చూడకుండానే పెదవి విరుస్తుంటారని, అయినా వారి అభిప్రాయాలను తాము పూర్తిగా కొట్టిపారేయలేమని చెప్పింది. ప్రేక్షకుల అభిప్రాయాలు ఎంత కఠినంగా ఉన్నా.. అవి తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఎంతో సాయపడతాయని వివరించింది.మంచి ఉద్దేశంతో పూర్తి హార్డ్ వర్క్‌తో, నిజాయతీగా తీసే ఏ సినిమా అయినా కచ్చితంగా ప్రేక్షకులకు చేరుతుందని జాన్వీ ధీమా వ్యక్తం చేసింది. జనం తొందరగా ఒక అంచనాకు వచ్చేసినప్పటికీ సినిమాలో దమ్ముంటే ఆదరిస్తారని చెప్పింది. ప్రేక్షకులు ఇచ్చే ప్రతి ఫీడ్‌బ్యాక్‌ను మనస్ఫూర్తిగా స్వీకరిస్తానని స్పష్టం చేసింది.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా వస్తున్న ‘పెద్ది’ సినిమాలో జాన్వీ నటించిన విషయం తెలిసిందే. ఈ భారీ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# పొలాచ్చిలో చిరు మూవీ షూటింగ్

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. ’వాల్తేరు వీరయ్య’ విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

------



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613